# కోడి

"రెండు స్పెషల్ కోడిపలావు-" అని ధీమాగా ఆర్డరిచ్చాడు గోవిందయ్య. డబ్బున్నవాళ్ళ మాట ధీమాగా వుంటుంది, నడక ధీమాగా వుంటుంది! నవ్వూ ధీమాగా వుంటుంది. ఇదంతా ఆ డబ్బు ధీమా! ఆ ధీమా డబ్బు తెచ్చే ధీమా!

గోవిందయ్య ప్రక్కన బిక్కు బిక్కుమంటూ కూర్చున్న రామారావు, తళతళ మెరుస్తున్న టేబుల్ను, ఆ టేబులు మీద చేటంత స్టీలు పళ్ళేన్ని, ఆ పళ్ళెంలో పడి గిరగిరా తిరిగే పంకా నీడను దిగులుగా చూస్తున్నాడు.

బీదవాళ్ళ చూపు దిగులుగా వుంటుంది. నవ్వు దిగులుగా వుంటుంది. మాట దిగులుగా వుంటుంది. నడకా దిగులుగా వుంటుంది. ఇదంతా బీదతనం వల్ల కలిగే దిగులుతనం!

కలిమికి లేమికి వున్న తేడా- గోవిందయ్య, రామారావులు!

గోవిందయ్య కండపట్టి దండిగా పచ్చగా వున్నాడు. రామారావు పీలగా ఎండిన నరుగులాగా వున్నాడు. గోవిందయ్యది సిల్కు లాల్చీ. ఒక గంటక్రితమే తొడగబడింది. ఆ లాల్చీనుండి వట్టివేళ్ళ సెంటువాసన వస్తూంది. రామారావుది సాదా చొక్కా. వారం రోజులుగా తొడగబడుతున్నది. ఆ చొక్కానుండి చెమటకంపు కొడుతున్నది.

"మీరు మరీ మొగమాటస్తులండీ రామారావు గారూ! ఎందుకలా ఇదయిపోతారు. ఇందులో ఏముందండి! ఆఫ్టరాల్ సింపుల్ మీల్స్-" అన్నాడు గోవిందయ్య.

గోవిందయ్య "ఇందులో ఏముందండీ ఆఫ్టరాల్ సింపుల్ మీల్స్" అని చాలా తేలిగ్గా అనగలిగాడు. ఆయనలాటివారికి ఇది చాలా సింపుల్ మీల్స్ కావచ్చును. కాని తనలాటి 'సగటువాడికి' మాత్రం ఇది చాలా ఖరీదైన మీల్సు, అందులోనూ ఈ హోటల్లో "ఏ" క్లాసు ఏర్‌కండిషన్డు రూంలోని మీల్స్ అంటే మాటలా? తనకు కనీసం వూహించుకోవటానికి కూడా అర్హత లేని ఖరీదైన మీల్స్!

ఈ హోటల్ ఆ నగరంలో కల్లా పెద్ద హైక్లాస్ నాన్ వెజిటేరియన్ హోటల్. ఈ నగరంలోనే కాదు, ఈ జిల్లా మొత్తానికి పేరుమోసిన హోటల్. అందులోనూ స్పెషల్ కోడిపలావుకు ఈ హోటల్ పెట్టింది పేరు! ఆ నగరానికి పనుల మీద వచ్చే మాంసాహారులయిన ధనికులు ఈ హోటల్‌లో కోడిపలావు తినకుండా పోరు. మిగతా హోటల్స్‌లో దిగే సినిమా యాక్టర్లు, గెస్టుహవుసుల్లో దిగే మంత్రులు కూడా ఈ హోటల్ నుండి కేరియర్స్‌లో భోజనం తెప్పించుకుంటారు.

పన్నెండు సంవత్సరాల క్రితం ఒకసారి తనీ హోటల్‌లో కోడిపలావు తిన్నాడు. అప్పుడు తనీవూర్లో బి.కాం. ఆఖరు సంవత్సరం పరీక్షలు రాసి, శలవులకు సొంత వూరికెళ్ళబోయే ముందు లక్ష్మీ టాకీసులో రాత్రి సినిమా చూచి ఇందులో కోడిపలావు తిన్నాడు. ఆ తర్వాత మరెక్కడా కూడా తను కోడిపలావు తినలేదు. ఆ పలావు రుచి గుర్తుకు వచ్చినప్పుడుల్లా తన నోట్లో నీళ్ల వూరుతాయి. ఈ పన్నెండేళ్ళలో తనకీ వూళ్ళోనే వుద్యోగం వచ్చింది. పెళ్ళయింది. పిల్లలు పుట్టారు. సంసారం పెద్దదయింది. దరిద్రం లావయింది.

ఈ పన్నెండేళ్ళలో ఈ హోటల్‌కి ఒక్కసారి వెళ్ళటానికి ఎన్నోసార్లు ప్రయత్నించాడు. కాని ఎప్పుడూ ఖాళీగా వుండే తన 'పర్సు' ఎప్పుడు తనకా ధైర్యాన్ని యివ్వలేదు. తన కోరికా తీరలేదు. అందులో ఈమధ్య తను అద్దె యిల్లు మారాడు. తను ఈక్రొత్త యింటినుండి ఆఫీసుకెళ్లాలంటే రోజూ ఈ హోటల్ ముందునుండే వెళ్ళాలి. ఆఫీసు కెళ్లేటప్పుడు, ఆఫీసునుండి తిరిగి వచ్చేటప్పుడు తనకు తెలియకుండానే తప్పనిసరిగా ఆ హోటల్ వంక చూస్తాడు. అలా చూచినప్పుడు ఒక్కోసారి ధైర్యం చేద్దామా అనిపిస్తుంది. కాని మళ్ళీ తన స్థితి గుర్తుకు వస్తుంది. ఈ హోటల్లో స్పెషల్ కోడిపలావు తినడమంటే మాటలా? హీనపక్షం పది రూపాయలు బిల్లు అవుతుంది. తనలాటి మధ్యతరగతి వాడు, చిన్న తరగతి వుద్యోగి, నలుగురు బిడ్డల తండ్రి, పచ్చడి మెతుకులతో చారు నీళ్ళతో కడుపాకలి తీర్చుకుంటూ కాలక్షేపం చేస్తూ అప్పులు పెంచే వడ్డీలతో. వడ్డీలు పెంచే అప్పులతో తల మునిగి వున్నవాడు, పుట్టికి మూడుతాళ్ళు తెగిన సంసారి ఒకపూట భోజనానికి పది రూపాయలు ఖర్చుపెట్టగలడా? ఈ పది రూపాయలుంటే పెళ్ళానికి రెండు జాకెట్లు, చంటిపిల్లాడికి చొక్కాగుడ్డా కొనవచ్చు. ఒక చిల్లర అప్పు తీర్చవచ్చు. ఏ గోంగూరో, టొమేటానోకాని వూరగాయపచ్చడి పెట్టుకుని రెండు నెలలపాటు తినవచ్చును. భార్య గుండెదడకు ఏ మందో కొనవచ్చును.....ఇలా మధ్యతరగతి ఇంగితం (ఇంగితానికి కూడా తరగతులు వర్గాలుంటాయి) పనిచెయ్యటం మొదలుపెట్టుతుంది. అప్పుడు తనను తాను తిట్టుకుంటాడు. ఇంట్లో పెళ్ళాం పిల్లల్ను తిట్టుకుంటాడు. ఛీ వెధవబ్రతుకు అనుకుంటాడు. ఛీ వెధవ హోటల్ అనుకుంటాడు. కాని, ఆఫీసునుండి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు ఆ హోటల్‌వంక చూడడం మాత్రం మానడు.

రాత్రి ఏడుగంటలవరకు ఆఫీసులో పనిచేసి మళ్ళీ రాత్రి యింటిదగ్గర చేయటానికి మరికొన్ని అర్జంటు ఫైళ్ళు చంకన పెట్టుకుని, నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ యింటికిపోతూ ఈ పూటకూడా అలవాటు ప్రకారం హోటలు వయిపు చూశాడు.

ఆ సమయంలో హోటల్ ముందు పేవ్‌మెంటు మీద ఠీవిగా నిలబడి దర్జాగా సిగరెట్టు పొగ వదలుతున్న గోవిందయ్య, ఫైళ్ళ రామారావును చూశాడు.

"ఏమండోయ్, రామారావుగారు?" అని కేకేసి పిలిచాడు.

తనకిక తప్పనిసరయి రోడ్డు దాటి వచ్చాడు.

గోవిందయ్య చాల నిండుగా నవ్వాడు. మరింత నిండుగా, ఆప్యాయంగా పలకరించాడు.

'ఏమండి రామారావుగారు ఇప్పటిదాకా ఆఫీసులోనే పనిచేస్తున్నారా?''

రామారావు అవునన్నట్లు తల వూపాడు.

"మీరు బలేవారండీ! మీలాగా ఇంత సిన్సియర్‌గా, ముక్కుకు సూటిగా పనిచేసేవాళ్ళు చాల తక్కువండి, మరీ యింత సిన్సియార్టీ వున్నా లాభం లేదండి! మీతో పెద్ద పరిచయం లేకపోయినా అంటున్నానని ఏమీ అనుకోవద్దండి. మీలాటివాళ్ళు ఈ వ్యవస్థలో బ్రతకటం కష్టం సుమండీ!'' అన్నాడు.

గోవిందయ్య "ముక్కుకు సూటిగా'' అనే మాటను ఎందుకు వాడాడో, తనకెందుకిలా ఉపదేశం చేస్తున్నాడో రామారావుకు తెలుసు. మొన్న ప్రొద్దున ఆఫీసులో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

ఆ వుదయం గోవిందయ్య ఆఫీసుకొచ్చాడు. వస్తూనే తన సీటుదగ్గరికి వచ్చాడు. ఆ సీట్లో చాలాకాలంగా వుంటున్న సీతాపతికి బదులు తనను చూడగానే కొద్దిగా షాక్ తిన్నాడు. అయినా పైకి నవ్వుతూ, "మీరు డిస్పాచ్ నుండి బిల్స్ సీట్లో కొచ్చారన్నమాట!'' అన్నాడు.

తను బదులుగా నవ్వాడు.

"మావి కొన్ని బిల్సు వున్నాయండి. కొస్త ఇవ్వాళ పాస్ అయ్యేటట్లు చూడండి!'' అన్నాడు ప్రాధేయపడుతున్న ధోరణిలో.

"మీ బిల్సు నిన్ననేగా వచ్చాయి. అంతకు ముందే వచ్చిన బిల్స్ వున్నాయి. అవి అయిన తర్వాత మీవి చూస్తాను. కాకపోయినా, మీ బిల్సులో కొన్ని అబ్జక్షన్స్ వున్నాయి.'' అని తను సమాధానం ఇచ్చాడు. తన మామూలు ధోరణిలో.

"నిన్ననే వచ్చాయనుకోండి. కాని చాల పెద్ద మొత్తం. ఏభైవేలదాకా రావాలి. నాకు కొద్దిగా డబ్బు అవసరం పడింది. పోనీ రేపటికయినా చెక్కు వచ్చేటట్లు చూడండి!''

"సారీ, కావండి. నేను అన్నీ వచ్చిన ఆర్డరు ప్రకారం పాస్ చేస్తాను.''

"ఆలస్యమయితే నాకు రోజుకు కనీసం రెండు మూడొందలు వరకు నష్టమండి. ఎవరు తిన్నట్లు కాదు - మిమ్మల్ని సంతోషపెట్టుతానులేండి! కావాలంటే నా సంగతి మన సీతాపతి గారిని అడగండి!' ' అన్నాడు గోవిందయ్య.

"కావాలంటే నా సంగతి ఆఫీసులో ఎవర్నయినా అడగండి నేనిలాంటి అవకతవక పన్లు చెయ్యను. అన్నీ ముక్కుసూటిగా రూల్స్ ప్రకారం చేస్తాను.'' సూటిగా సమాధానం చెప్పాడు.

ఈ సంఘటన మనస్సులో పెట్టుకునే ఇప్పుడు తనకీ హితబోధ చేస్తున్నాడు.

గోవిందయ్య ఆఫీసు మాటలు మానేసి మీకు పిల్లలెంతమంది. మీ యిల్లెక్కడా, సొంత యిల్లా, అద్దె యిల్లా, అద్దెంత - ఇలాంటివే రామారావు సొంత విషయాలు అడిగాడు. ఇవన్నీ చెప్పటం తనకిష్టం లేకపోయినా, పోనీలే పెద్దాయన అడుగుతున్నాడని సభ్యతకోసం అన్నింటికీ సమాధానం చెప్పాడు.

తర్వాత ఆ మాటా ఈమాటా మాట్లాడి, "రండి భోంచేద్దాం-'' అని చనువుగా తన చేయి పట్టుకున్నాడు.

"భోజనమా?'' - ఆశ్చర్యంగా అన్నాడు.

"ఏం, మీరు మిల్ట్రీ భోజనం చేయరా? మీరు నాయుళ్ళు అని నాకు తెలుసు. మేమూ నాయుళ్ళమే!" అని కులాలు కలిపాడు.

"అబ్బే, నేను భోంచేయనండి-" తను నిక్కచ్చిగా అన్నాడు.

గోవిందయ్య గల గల నవ్వేడు.

"మీరు బలేవారండి. మీరు నాతో కలిసి భోంచేసినంత మాత్రాన మా బిల్స్ పాస్ చెయ్యనక్కర్లేదు లేండి. భోజనానికి బిల్స్‌కు ఏమీ సంబంధం లేదు.'

"లేదనుకోండి-" తను నీళ్ళు నమిలాడు.

"మరింక దేనికి సందేహిస్తారు? నేనా ఈవూరు వాడ్ని కాను. పనిమీద ఈ వూరు వచ్చాను. హోటల్‌లో వుంటున్నాను. హోటల్‌లో తింటున్నాను. మనం ఒక కులం వాళ్ళం కాబట్టి సరదాగా కలిసి భోంచేద్దామంటున్నాను. నాకు ఒక్కడ్నే భోం చెయటం అలవాటు లేదు. పోనీ మీ యింటికి రమ్మంటే వస్తాను పదండి. మీ యింట్లో భోజనం పెట్టుదురు కాని, అమ్మాయివాళ్ళను, పిల్లలను చూచినట్లు కూడా వుంటుంది" అన్నాడు.

తనింట్లో భోజనమా? - నవ్వు వచ్చింది.

గోవిందయ్య చెప్తున్నదీ సబబుగానే వుంది. పయిగా వయసులో తనకంటే పెద్దవాడు. ఇంతగా బలవంతం చేస్తుంటే తనింకేమంటాడు?

నవ్వి, వూకి - "ఆకలిగా లేదండి,"- అని అన్నాడు.

"పోనీ, వుత్త పలావు తిందురుగాని రండి." అని మళ్ళీ చెయ్యిపట్టుకున్నాడు.

పలావు పేరు వినగానే పన్నెండు సంవత్సరాలుగా తీరని కోరిక మనస్సులో బలంగా కదిలింది. అంతే, ఇక కాదనలేక పోయాడు.

.... వేడి వేడిగా వున్న కోడిపలావు మసాలా వాసన నసాళాన్ని పలకరిస్తుంటే రామారావు మారు మాటాడకుండా ఆబగా తింటున్నాడు. అతను తినే తీరునిబట్టి అతని కెంత ఆకలిగా వుందో, పలావు అతనికంత అపురూపంగా వుందో గోవిందయ్య ఇట్టే మెజర్ చేశాడు. అందుకనే ఇంకో పావు ప్లేటు ఆర్డరిచ్చాడు, మనసులో నవ్వుకుంటూ.

మొత్తం అరప్లేటు పలావును రామారావు సునాయాసంగా వూదేశాడు. గోవిందయ్య కూడ తక్కువేం తినలేదు. బ్రిడ్జీలు, వంతెనలు, రోడ్లనూ తినేసే కాంట్రాక్టరుకు ఇదొక లెఖ్ఖా? రామారావుని చూచి గోవిందయ్య, గోవిందయ్యను చూచి రామారావూ పోటీలు పడి తింటున్నారా అన్నట్లుగా వుంది అక్కడి పరిస్థితి!

మళ్ళీ "వైట్ రైస్", స్పెషల్ కోడి ఇగురు తెప్పించాడు. అది తింటుండగా కోడి "రోస్ట్" వచ్చింది. రామారావు తింటూ ఆలోచిస్తున్నాడు. ఇదేం తిండి? ఇదేం ఆకలి? ఎన్నో రోజులుగా పస్తులున్నవాడు తిండికి మొగం వాచినవాడు తింటున్నట్లుగా తాను తింటున్నాడు. ఇది తప్పితే మళ్ళీ ఛాన్సు దొరకదని తింటున్నట్లుగా వుంది. తనకింత ఆకలిగావుందా? అయితే రోజూ వుంటే తనింత తిండి తినగలడన్నమాట!

అతనికి, యింటిదగ్గర తన పిల్లలూ, భార్యా గుర్తుకువచ్చారు. ఈ పలావు, ఈ వేపుళ్లూ వాళ్ళకు కలలోని విషయాలు కదా? వాళ్ళు సరైన తిండి తిని ఎన్నాళ్ళయింది? ఏదో వొక తిండి అయినా ప్రతిపూటా కడుపునిండుగా తింటున్నారా? అదీ లేదు - ఎప్పుడు చూచినా వుసూరుమనే పొట్టలతో వుంటారు. అసలు తనింట్లో 'నీసు' వండి ఎన్ని ఏళ్ళు అయింది. వాళ్ళు ఈ పూట ఏం తిన్నారో!..... అయ్యో తనమతి మండిపోను - ఈ పూటకు బియ్యం లేవని కమల వుదయమే చెప్పింది. తనా విషయమే మర్చిపోయి ఇక్కడ ఏర్‌కండిషన్డు రూంలో కూర్చుని కోళ్ళను లేపుతున్నాడు ఎంత దారుణం?

దారుణం కాదూ, ధనియాల కారం కాదూ - తను మాత్రం రోజూ ఇవన్నీ తింటున్నాడా? ఏదో ఇవ్వాళ ఛాన్సు దొరికిందని తింటున్నాడు కాని, తనకు మాత్రం ఇలాటి భోజనం కలలోని విషయము కాదా? కాకపోతే ఈపూటకు మాత్రము తన కల నిజమవుతుంది - అంతే! గోవిందయ్య చెప్పినట్లు తను వింటే, ఈ కల ప్రతి రోజుకు, ప్రతి పూటకు నిజమవుతుందిగా! ఛా. తను ఆలా చేస్తాడా?

"భోం చెయ్యకుండా ఏమిటండి ఆలోచిస్తున్నారు?" గోవిందయ్య పలకరింపుతో ఆలోచనలను కట్టిపెట్టి, తిండి మీదకు ధ్యాస పోనిచ్చాడు.

మీగడ పెరుగుతో భోజనం ముగిసింది.

మీగడ పెరుగు తింటుంటే, పెరుగుకోసం కవ్వర్లాడిపోయే తన చిన్న కొడుకు గుర్తుకు వచ్చాడు. "సొల్లునీళ్ళు"లాంటి మజ్జిగతో పిల్లలు అన్నాలు తినటం గుర్తుకు వచ్చింది.

కిళ్ళీ నములుతూ, గోవిందయ్య యిచ్చిన గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు ముట్టించాడు.

హోటల్ బిల్లు ముప్పై రెండు రూపాయలు అయింది. బయటికి వచ్చారు.

"రిక్షాలో యింటికి వెళ్ళుతారా?"

"వద్దండి.... నడిచే వెళ్ళుతాను."

"మీరు ఏమీ అనుకోనంటే నాది చిన్న మనవి. ఈసారికి మాత్రం నా బిల్లులు తొందరగ పాస్ చేయించండి. ఏమీ అబ్జక్షన్లు లేకుండా, ఎందుకంటే మా అమ్మాయి పెళ్ళి ఒకటుంది."

"సరే, అలాగే చూద్దాంలేండి, " అని అన్నాడు. అలా అనకేం చేస్తాడు? నేను ముక్కుసూటి మనిషిని అని అంటాడా? గోవిందయ్య "కోడి" కడుపులో వుందిగా! అది అలా అననిస్తుందా! మొగమాట పెట్టదూ?

"ఇక సెలవు రేపు ఆఫీసు కొస్తాను." ఇలాటివాళ్ళను ఎంతమందిని చూశాను అన్నట్లుగా గోవిందయ్య కోరమీసాల క్రింద గర్వంతో కూడుకున్న చిరునవ్వొకటి మెరిసింది. ఎవర్ని ఎలా బుట్టలో పెట్టాలో తనకు తెలియని విద్యా?

రామారావు అడుగులు బరువుగా పడుతున్నాయి. విపరీతమైన ఆయాసంగా వుంది. పొట్టంతా బరువుగా వుంది. సిగరెట్టు తర్వాత సిగరెట్టు త్రాగుతున్నాడు. మధ్యలో ఒకచోట ఆగి సోడా కూడా త్రాగాడు.

కడుపు నిండకపోయినా కష్టమే! నిండినా కష్టమే. కడుపు నిండిన వాళ్ళందరూ సుఖంగా వుంటున్నా రనుకోవటం కూడా పొరపాటే అని తెలిసింది.

విపరీతమైన ఆయాసంతో నడవలేక మధ్యలో ఒక వంతెన మీద కాసేపు కూర్చున్నాడు. ఆ వంతెన కెదురుగా ఒక రావిచెట్టు వుంది. రావిచెట్టు ప్రక్కన వీది దీపం వుంది. ఆ దీపం క్రింద ఒక ముసలమ్మ కూర్చుని వుంది. ఆమె చుట్టూ గిన్నెలున్నాయి. వాటిలో అన్నం, సాంబారు కూరలున్నాయి. అలగావాళ్ల ఆమె ముందు కూర్చున్నారు - పింగాణి ప్లేటులు, రబ్బరు గ్లాసులు పట్టుకుని, ఆ ప్లేటల్లో గిన్నెతో అన్నం కొలిచి పెట్టుతుంది. వాళ్ళు ఆ కొలత అన్నం తింటున్నారు. ఏ రెండు మూడు రోజులు పస్తులున్న తర్వాతనో ఆ అన్నం తింటున్నారు. మళ్ళీ రెండు మూడు రోజుల వరకూ మళ్ళీ ఈ అన్నానికి డబ్బులు పోగయ్యేవరకు తినరు. ఆ కొలత భోజనాన్ని వాళ్ళు ఎంతో తృప్తిగా, నిండుగా, తాపీగా తింటున్నారు. అది వాళ్ళ చెమటతో కొనుక్కున్న అన్నం. అందుకే దాన్ని నిర్భీతిగా తింటున్నారు. తనలాగ దొంగచూపులు చూచుకుంటూ, ముక్కలు పీల్చుకుంటూ, చెమటలు కార్చుకుంటూ, కక్కుర్తిగా బేవర్సుగా తినటం లేదు. వాళ్ళను చూస్తుంటే తనకు సిగ్గేసింది. ఆ వంతెన మీద ఎంతోసేపు కూర్చోలేక పోయాడు. లేచి మళ్ళీ నడక సాగించాడు.

ఇల్లు దగ్గర పడుతున్న కొద్దీ గుండెల్లో గుబులు ఎక్కువౌతుంది. కమలా, పిల్లలూ ఏం తిన్నారో ఏమిటో? తొందరగా యింటికి వచ్చి పైళ్ళు ఇంటి దగ్గర పడేసి ఒక స్నేహితుని దగ్గరకెళ్ళి డబ్బులు అప్పు తీసుకొని బియ్యం తీసుకొద్దామనుకున్నాడు. కాని, మధ్యలో ఇలా అయ్యింది. తను పొట్టపగల తిని నడవలేక నడవలేక నడుస్తున్నాడు.

కమల మేలుకొని వున్నట్లుంది. తలుపు తట్టగానే లేచి తలుపు తీసింది. తను మెల్లగా దొంగలాగా తల వంచుకుని లోపలికెళ్ళాడు.

పిల్లలు కింద చాపమీద వరసన పడుకుని నిద్రలు పోతున్నారు.

తను బట్టలు మార్చుకుంటుంటే కమల మెల్లగా అడిగింది, "ఇంత ఆలస్యంగా వచ్చారేమండి? ఈ పూటకు బియ్యం లేవని పొద్దుటే చెప్పానుగా-"

తను ఏమీ మాట్లాడలేదు.

మళ్లీ ఆమే అంది. "అప్పు ఎక్కడా దొరకలేదా? నేనూ అదే అనుకున్నాను. నాకూ ఒక్క డబ్బా బియ్యం కూడా ఏ అమ్మా అప్పు యివ్వలేదు. మనం తీసుకున్నవి సక్రమంగా యిస్తుంటేగా బదుళ్ళు పుట్టటానికి."

"మరేం చేశావు?"

"ఏం చేస్తా? నా దగ్గర చిల్లర పైసలుంటే బన్‌రొట్టెలు తెప్పించాను. అదే తలకాస్తా తిని నీళ్ల తాగి పండుకున్నారు."

రామారావు కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది. పిల్లలు బన్‌రొట్టి ముక్కలుతిని నీళ్ల త్రాగి పండుకుంటే తనేమో కోడిపలావు, కోడి ఇగురు, కోడి రోస్టులు, మీగడ పెరుగులు మెక్కి ఆయాసపడుతూ వచ్చాడు.

లుంగీ కట్టుకుని కింద చతికిలపడి గోడకానుకుని కూర్చున్నాడు.

"సరే లేవండి, మీ కోసం ఒక బన్ అట్టేపెట్టి వుంచాను, తిందురుగాని," అంది.

"అబ్బే, నాకు ఆకలిగా లేదు. నీవు తిను కమలా."

ఆకలిగా లేదని చెప్పలేక, హోటల్‌లో తేర తిండి పీకలదాకా మెక్కి వచ్చానని చెప్పుతాడు ?

"అన్నీ దొంగమాటలు. పొద్దునెప్పుడో ఇంత తిని వెళ్ళారు, ఆకలిగా లేకపోవడమేమిటి? లేవండి - చింతకాయపచ్చడి నంజుకుని తింటే బన్ రొట్టి బలే రుచిగా వుందండి-"

"అసలికే నాకు చిరాకుగా వుంది. వూరికే విసిగించక వెళ్ళి పడుకో పో - ఆకలిగా లేదే తల్లీ అంటే వూరికే వెధవ నస పెట్టుతావు." అని విసుగ్గా అన్నాడు.

పాపం కమల చిన్నబుచ్చుకుంది. మారు మాటాడకుండా మెల్లగా వెళ్ళి చంటిపిల్లాడి పక్కన పడుకుంది.

వంటింటి తలుపు తీసుకుని దొడ్లోకి వచ్చాడు. నూతి చప్టామీద కూర్చున్నాడు. సిగరెట్టు తీసి వెలిగించాడు. బయట అంతా వెన్నెలగా వుంది. ఎంతో ప్రశాంతంగా వుంది. తనకే శాంతి లేకుండా వున్నది. తనలో ఏదో వికారం, ఆ వికారం మితిమీరి తినటం వల్ల వచ్చింది. పిల్లలు వుత్త రొట్టె ముక్కలు తిని నీళ్ళు త్రాగితే తను మృష్టాన్నమారగించానే అనే గిల్టీకాన్షస్ వల్ల వచ్చింది. తన భార్య ఎంతో ప్రేమగా తనకోసం రొట్టె దాచిపెట్టి, దాన్ని తినమని ప్రేమగా ప్రాధేయపడితే, ఫూల్‌లాగా కసిరి కొట్టానే అనే భావం వల్ల వచ్చింది.

సిగరెట్టు త్రాగుతూ అనుకొన్నాడు.....

తనలోని ఈ అశాంతికి, అలజడికి, వికారానికి ఆ గోవిందయ్య గాడే కారణం! వెధవ వుడుం లాగా పట్టుకుని బేవార్సు తిండి పెట్టించాడు. లేకపోతే పెందరాళే యింటికి వచ్చి పెళ్ళాం బిడ్డలతో పాటు ఏదో ఇంత తిని ఇన్ని నీళ్ళు త్రాగి హాయిగా, ప్రశాంతంగా పడుకునే పని. ఇందాక హోటల్ బయటికొచ్చిన తరువాత, వాడు పెట్టించిన తిండి తిని వుండడం వల్ల తను మెత్తబడ్డాడు. తనొక్కడూ మడిగట్టుకుని వుద్ధరించేదేమిటి? నలుగురితోపాటు నారాయణ అని అనుకుంటే రోజూ ఇలాటి డిన్నర్లు తినవచ్చును అని మనస్సులో అనుకున్నాడు. ఇంకా నయం ఈ వూబిలోకి దిగకముందే కళ్ళు తెరుపుళ్ళు పడ్డాయి. వాడు పెట్టించిన వుత్త భోజనం తింటేనే ఇంత గందరగోళం జరుగుతుంది; ఇంత అశాంతి రేగుతుంది. అదే రేపు వాడు చెప్పినట్లు తప్పుడు పనులు చేసి వాడిచ్చే లంచం డబ్బులు తీసుకుంటే ఆ తప్పుడు కూడు పెళ్ళాం బిడ్డలు కూడా తింటే ఇంకెన్ని అనర్థాలు జరుగుతాయో! అందాక ఎందుకు సీతాపతి విషయమే తీసుకుంటే -- సంపాదించటానికి వాడు నెలకు నాలుగైదు వందల పైనే సంపాదించేవాడు. కాని లాభం ఏమిటి? వాడికి సుఖం లేదు. వాడి పెళ్ళానికి బట్టలవిడుపు జబ్బు. పెద్ద కొడుక్కి పోలియో వ్యాధి. వాడికి చూడబోతే త్రాగుడు అలవాటు. ఈ లంచాల డబ్బంతా డాక్టర్లకు తన త్రాగుడుకే ఖర్చయిపోతుంది. పైగా అది కూడా చాలక అందరి దగ్గరా అప్పులు చేస్తాడు.

రామారావు సిగరెట్టు అవతల పారేసి మెల్లగా లేవబోయాడు. ఇంతలో కడుపు అంతా ఒక్కసారి

మెలిపెట్టినట్లయి పెద్ద వాంతి అయిపోయింది. ఇందాక హోటల్లో తిన్న తిండి అంతా వాంతి అయిపోయింది.

తను గత పన్నెండు సంవత్సరాలుగా ఎంతగానో వువ్విళ్ళూరి, గుటకలు మ్రింగి, కలలు కని, ఆశపడి, ఈపూట ఎంతో యిష్టంగా, కక్కుర్తిగా తిన్న కోడిపలావు అంతా కడుపులో యిమడక వాంతి అయిపోతే, ఆ కల్మషాన్ని, కల్మషంగా మారిన ఒకానొక కోరికను తొట్టిలోని నీళ్ళతో కొట్టేశాడు. అదంతా కాలవలోనికి కొట్టుకుపోయింది.

ఇప్పుడు కడుపంతా ఖాళీ. గోవిందయ్య గాడి హోటల్‌కూడు తినకముందు ఎలా నాచుకుపోయి, వీపుకంటుకుపోయి వున్నదో ఇప్పుడూ అలాగే వుంది. పైగా ఎంతో హాయిగా వుంది. ప్రాణానికెంతో తెరిపిగా వుంది.

ఇలాంటి అన్యాయపు కూడు తిందామన్నా తనలాటి వాడికి ఇమడదు. జీర్ణం కాదు. జీర్ణం చేసుకోగలవాళ్ళు వేరే వుంటారు.

ఇంట్లోకి వచ్చి తలుపేసుకున్నాడు. రెండు గ్లాసుల మంచినీళ్లు గడగడ తాగాడు. మెల్లగా వెళ్ళి చాపమీద కమల ప్రక్కన పడుకున్నాడు. పడుకుంటూ ఎడాపెడాగా పడుకుని అమాయకంగా నిద్రపోతున్న పిల్లల వంక చూశాడు. మీలో ఎవరికీ పోలియో వ్యాధి రాకూడదనుకున్నాడు. మనస్సంతా ప్రేమవూటలతో నిండిపోగా.

కమల దగ్గరికి జరిగి ఆమె పొట్టమీద చేయివేశాడు. పొట్టవీపుకతుక్కుపోయి, వుసూరు మంటూ వుంది. కాని నిద్రపోతున్న మొగంలో ఎంతో ప్రశాంతత, నిండుదనం, 'ఇలా జరిగితే చాలు!' అన్న తృప్తి వుంది.

ఇప్పుడు తన కడుపులో కోడి పలావు లేదు. కోడి యిగురు లేదు. కోడి రోస్ట్ లేదు. వికారం లేదు. అలజడి లేదు. అశాంతీ లేవు. వాళ్ళ కడుపుల్లో నీళ్ళు వున్నాయి! తన కడుపులోనూ కూడా నీళ్ళు వున్నాయి. తనకీ లంచాల కూడు వద్దు. ఆ అన్యాయపు డబ్బూ వద్దు. ఈ బీదరికమే హాయి. వున్ననాడు తిని, లేనినాడు ఇన్ని నీళ్ళు త్రాగి పెళ్లాం బిడ్డలతో కలిసి కాలక్షేపం చేయగలిగితే చాలు; అదే పదివేలు.

రామారావు మగతగా కళ్ళు మూసుకున్నాడు.

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

★